# చిట్టిరాజు

## ఆర్. వసుంధరాదేవి



స్వదేశం వదలి న్యూయార్కుకు వచ్చినప్పటి నుంచీ సుమిత్రకు జీవితం ఏమిటోగా కనిపిస్తున్నది. తనతో సంబంధం లేనట్లుగా జరిగిపోతున్నది. చదరంగంలో పావులుంటవి. ఒక్కో దానికీ కొన్ని శక్తులు, కొన్ని పరిధులు. 'బిషప్' మూలలకే పోతుంది. 'రూక్' ఎదరికీ, ప్రక్కలకీ వరుసలోనే పోగలదు. గుర్రం ఎగిరి దుముకుతుంది. 'పాన్' అడుగడుగు ముందుకే వేస్తుంది. రాజుకి ఒక పరిధి, రాణికి వేరే పరిధి. అందరూ తమ పరిధుల్లో తమ శక్తులతో తిరుగుతూ ఉంటారు. మొత్తం మీద ఒక ఆట ఏర్పడి జరుగుతూ ఉంటుంది. కానీ అందులో నుంచీ తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. తప్పించుకోగలిగితే ఆట ఏముంటుంది? ఆ పరిధులూ, ఆ శక్తులూ - అవే ఆటకు మూలం.

సుమిత్రకు ఇంత వైరాగ్యం రావడానికి ఎన్నో కారణాలుండొచ్చు. కూతురి ఇల్లు తనదని అనుకోలేకపోవడం ఒక కారణం. మూడేళ్లు కళ్లల్లో పెట్టుకు పెంచుకొచ్చిన మనవణ్ణి వాడి తల్లిదండ్రులకు వప్పగించి తిరిగి వెళ్లాల్సిరావడం ఒక కారణం - ఇంకా ఇతర కారణాలూ ఉండొచ్చు వెతికితే. జీవితంలోని నాలుగు దశలూ, నాలుగు ఆశ్రమాలూ, జరిగి పోతున్న వయసూ - ఇంతకు ముందెప్పుడూ ఆలోచనలోకి రాని జీవిత సత్యాలన్నీ కళ్ల ముందే నిలబడి ఉంటున్నవి ఇప్పుడు. సుమిత్ర అనబడే మనిషి అంతరంగానికీ, జీవిత చదరంగానికీ సంబంధమే లేనట్లుంది.

"మీ అమ్మ తెలివీ, నీ కొడుకు తెలివీ సమానమే. ఆవిడ ఎప్పుడూ వాడి వెనకే తిరుగుతూ ఉంటుంటుందెందుకు? వేరే పని లేనట్లు!... బుర్ర ఉంటే కదా పని అవసరం!..." శోభన్ వెటకారంగా గొణగడం వినిపించింది.

"నా కొడుకు బుర్రలేనివాడా?" లక్ష్మికి కోపం వచ్చినట్లుంది.

శోభన్ నవ్వు వినిపించింది - "కాదులే... వాడు చిన్నవాడు గదా. బుర్ర పెరుగుతుంది."

తనను గురించి అల్లుడు అంటున్న ఈ మాటలు విన్న సుమిత్రకి ఆశ్చర్యమూ, కోపమూ కలిగాయి.

ఆవిడ కూతురి ఇంటికి న్యూయార్కు వచ్చి ఒక్క నెల దాటింది. కూతురూ, అల్లుడూ ఉద్యోగస్థులు గనుక పసి బిడ్డను సరిగ్గా చూసుకోలేరని మనవడు ఉదయభానుని మూడేళ్ల క్రిందట తనతో తీసుకెళ్లి పోయింది. ఇప్పుడు తిరిగి తీసుకొచ్చింది. వాడికి బాధ కలక్కుండా మెల్లగా తల్లిదండ్రుల దగ్గర అలవాటు చేసి "డే కేర్ సెంటర్" కు వెళ్లడం నేర్పించి, వాడు స్థిరపడ్డాక తాను ఇంటికి తిరిగి వెళ్లడానికి మూడు నెలలు పడుతుందని అనుకున్నది. తాను లేకున్నా గడిచి పోయేట్లు ఇంటి దగ్గర ఎన్నో ఏర్పాట్లు చేసుకుని బయల్దేరి వచ్చింది.

తెలుగు వారి ఆనవాయితీ ప్రకారంగా ఆమె అల్లుడి ఎదుట నిలబడి మాట్లాడడం అరుదు. కూతురూ ఉద్యోగస్థురాలు గనుక ఎక్కువగా మాట్లాడే అవకాశమూ లేదు. ఎవరి పనులు వారివి. వాళ్ల విషయాల్లో తలదూర్చకుండా పిల్లవాడి సంగతి మాత్రం చూసుకుంటూ ఉంది. అందువలన ఆ ఇంట్లో జరుగుతున్న చాలా విషయాలు గ్రహించలేదామె. కానీ ఈ మధ్యన కొన్ని సంగతులు గమనించక తప్పలేదు. రుసరుసలాడే అల్లుడి ముఖం చాలాసార్లు ఎదురయ్యాక, కొన్నిసార్లు గిన్నెలు విసిరికొట్టబడినాక, తలుపులు

ధమధమా తన్నెయ్యబడినాక ఆమె మనసుకు మెల్లగా అర్థం అవుతూ వచ్చిన విషయం  అతని కొడుకుని ప్రేమతో మూడేళ్లు పెంచినందుకు తన ఎడల అల్లుడు శోభన్ కృతజ్ఞతతో పొంగిపోవడం లేదు! పైగా, "పెంచే పని అయిపోగానే బిడ్డను తమకు వప్పగించేసి మాయమైపోకుండా ఈ మనిషి ఇంకా ఇక్కడెందుకున్నదీ!" అన్న చీకాకుతో వేగిపోతున్నాడు.

సుమిత్ర ఈ విషయం గుర్తించగానే మొదట చాలా ఆశ్చర్యపోయింది. తాను ఇవాళ కాకపోతే రేపు వెళ్లిపోయే మనిషే కానీ ఇక్కడ ఉండిపోయే ప్రసక్తి లేనే లేదు. తను వాళ్లకు సహాయంగా ఉంది కాని తన వలన వాళ్లకి బాధ లేకుండా సర్దుకునే ఉంది. మరి ఈ శోభన్ గొడవంతా ఎందుకట!

ఆమెకు చాలా బాధ కలిగింది. మూడేళ్ల నుంచీ తానెందుకు ఇంత భారం నెత్తికెత్తుకుంది?... మనసుకు ఛీ! అనిపించింది.

అయినా పెట్టే బేడా సర్దుకోకుండా ఇంకా నిబ్బరంగా నిలబడింది అంటే దానిక్కారణం ఆమె "చిట్టిరాజు". మూడేళ్లు పెంచిన మమకారం నోరు నొక్కేస్తే మూగ బొమ్మలా ఉండిపోయింది. చిట్టిరాజు కోసం - వాడు 'అమ్మమ్మా!' అని పిలిస్తే తాను అక్కడుండని రోజు దగ్గర్లోనే ఉందని తెలుసు. కాని తన తొందరపాటు వలన వాడికి బాధ కలక్కూడదు అని నిర్ణయం చేసుకుంది. వాడికి అన్ని ఏర్పాట్లూ కుదిరాకనే తాను వెళ్లిపోవాలి.

వాడికి జరగవలసిన మార్పులూ, అలవాట్లూ అన్నీ తాను ముందుగా నిర్ణయించుకున్న పద్ధతి ప్రకారమే ఈ ఇంటికి తగినట్లుగా క్రమంగా మార్పుతూ, నేర్పుతూ వస్తున్నది... ఇందులో పొరపాటు ఎక్కడ వచ్చింది? అసలు తన ఉనికే తప్పా! అమ్మమ్మ! నాయనమ్మ, తాతయ్య - ఈ బంధాలకి తల్లిదండ్రులకూ లాగా హక్కులూ, విశేషాలతో లేకపోవచ్చుగాని అసలు బంధమే లేదంటే కుదురుతుందా?" ఆమె ఆలోచనలు అస్తవ్యస్తంగా సాగిపోతున్నవి.

★ ★ ★ ★

చిన్న చేతులు - గోడకు పట్టు చిక్కించుకుని పైకెగబ్రాకాలని వ్యర్థ ప్రయత్నాలు చేస్తూ - అవి ఏ అయిదేళ్ళ పిల్లకు దాటలేని ఎత్తు గోడలు!

తాతయ్య చచ్చిపోయాడు.... అందరూ వచ్చి ఏమిటేమిటో చేస్తున్నారు...
"నేను చూస్తా, నేను చూస్తా, నేను చూస్తా"-

పిల్లలు ఇటువంటివి చూస్తే భయపడతారని తననీ, చెల్లిల్ని ఇద్దరినీ ఎదురింట్లో ఆ ఎత్తు గోడల వెనకాల వేసి తలుపులు బయట గొళ్లెం పెట్టేశారు బాధ్యత గల పెద్దవాళ్లు. "నేను చూడాలి తాతయ్యని" అంటే వినిపించుకోలేదు... అందుకే ఆ చిన్న చేతులు పట్టు చిక్కించుకుని పైకెగబ్రాకాలని పట్టుదలగా ప్రయత్నం చేస్తున్నవి. పెద్దగా శోకాలూ, గోవిందలూ వినిపించేసరికి ఆత్రం పట్టలేక ఎట్లా ఎక్కేసిందీ గోడ ఎక్కేసింది.


"ఎక్కండి... పై కెక్కేసింది... పట్టుకుని లోపలెయ్యండి... ఝడుసుకుంటుంది" కసిలాంటి ఉత్సాహంతో మనుమలు ఆ పిల్లని మళ్లీ లోపల వేసేశారు.

★ ★ ★ ★

మరుపు తెరల్ని తోసేసి జ్ఞాపకాల వెలుగులోకి రావాలని ప్రయత్నిస్తున్న అనుభూతి...

ఆ పిల్లకి, తాతయ్యంటే ప్రేమా?
ఆ పిల్లకి తెలియదు.
తాతయ్యకి ఆ పిల్లంటే ప్రేమా?
ఆ పిల్లకి అదీ తెలియదు.
అయితే మరేం తెలుసు?

ఆ పిల్ల ఎప్పుడైనా తాత గారింటికి వచ్చినప్పుడు పొలంలో తాటి చెట్ల నుంచీ చాలా ముంజెలు తెచ్చేవాడు తాతయ్య. బజారు నుంచీ చాలా లేత మొక్కజొన్న కండెలు తెచ్చేవాడు. సపోటా పళ్లు తెచ్చేవాడు. బెల్లం పాకం ఓడుతూ ఉంటే జిలేబీ తెచ్చేవాడు. ఇవన్నీ ఆ పాపకి చాలా చాలా ఇష్టమైనవి. ఇంకా ఏమేం తెచ్చేవాడో జ్ఞాపకం లేదు. ఇదే గుర్తు. తన ఎద్దుల బండిలో ఎక్కించుకుని పొలానికి తీసుకెళ్లేవాడు. ఆ ఇద్దరూ ఏవేవో మాటలు చెప్పుకుంటూ వెళ్లేవాళ్లు. ఎన్నో సంగతులు అడిగేది - ఊరి మధ్యనున్న రచ్చబండ గురించీ, పొగాకు చుట్టల గురించీ, పోతరాజు గుడి గురిరిచీ, అక్కడున్న ఊడల మర్రి గురించీ, అందులోని దయ్యాల గురించీ, ఊరి



## ఇచ్చట కథలు కొనబడును: అమ్మబడును

ఇచ్చట కథలు తయారు చేయబడును
కారు చౌకగా కథలు అమ్మబడును, కొనబడును
ముడి పదార్థాలను టోకుగా అమ్ముతాం
మూల సూత్రాలను రిబేటుకు ఇస్తాం
కేజీ ల్లెక్కన కథలు కొన్న వారికి
మినీ కవిత ఉచితం!
ఇంపోర్టెడ్ మిషనరీపై తయారు చేసిన
తాజా కథల కార్ఖానాలో సెలక్షన్ మీ ఇష్టం
క్రైం, సస్పెన్స్, సరస, సాహస, ట్విస్టు, ఘోస్టు కథలు
ఏవైనా ఆర్డ రిచ్చిన వెంటనే ఆదరా బాదరా తయారీ!
డోర్ డెలివరీ మా ప్రత్యేకత!
నకిలీల మాయాబజార్, నగిషీల పైపూత
మా వద్దే లభ్యం!
కొలిమి నుండి తీసి, సాగకొట్టి, సానపెట్టిన
తాజా కథలు- త్వరపడండి, త్వరపడండి
పాత కథలూ పాత వస్తువుల  గదిలో మూలకు విసిరేయండి
ఇన్‌స్టాంట్ కథలు...ఫాస్ట్ ఫుడ్ కథలు
గాలి చొరని సీలు ప్యాకేజీతో సిద్ధం
ఆఫ్‌సెట్ ప్రింటింగుతో, అందాల బొమ్మలతో
మెరుగు కాగితంపై మేలిమి కథలు
అత్యంత అనుభవంతో 'మేధో కార్మిక రచయితల శ్రమతో
వాడిగా, వేడిగా చేసిన
తాజా కథలకు తరలి రండి.
ఆర్డర్లపై ఇచ్చట
స్వదేశీ, విదేశీ కథలు సైతం తయారు చేయబడును
గమనిక:
మా వద్ద కొన్న కథలకు గ్యారంటీ మాత్రం లేదు
పాఠకుల సేవే మా పరమార్థం. రండి.  తరలి రండి.
ఇచ్చట కథలు కొనబడును...అమ్మబడును.

కోగంటి మురళీకృష్ణ

మధ్యనున్న మంచినీళ్ల బావి గురించీ చాలా విషయాలు తోచినవన్నీ అడిగేది. అడిగినవన్నీ చెప్పేవాడు. గతుకుల బాటలో బండి కుదిపేస్తుంటే ఎగిరిపడి నవ్వుకుంటూ ఎన్నో సంగతులు తాపీగా చెప్పుకుంటూపోయేవాళ్లు. స్వేచ్ఛగా వీచే చల్లగాలి మీదుగా ప్రవహిస్తూ ఉండేది.

ఆ పిల్లకు అవన్నీ జ్ఞాపకాలు. జ్ఞాపకాలకు మించిన గాఢమైన అనుభూతులు - వాటితో అవినాభావంగా స్వేచ్ఛా సంతోషాలు -

తాతయ్యకు జబ్బు చేసినప్పుడు - "తాతయ్యా! నీ దగ్గరేదో వాసనొస్తున్నది. లేచి నీళ్లు పోసుకో" అన్నది. "నాకు జ్వరం కదా. నేను మంచంలో నుంచీ లేవలేను" అన్నాడు. ఆరిందాలా తలూపుతూ. "కావాలనుకుంటే లేవొచ్చు. ఏముందీ, ఇల్లా పైకి లేవడమే" అని లేచి చూపిస్తే నవ్వాడు. తాతయ్యకి జబ్బు ఎక్కువైపోయింది. పిచ్చి మాటలు మాట్లాడేవాడు. బయట వర్లపురి మీది నుంచీ వ్రేళ్లాడుతున్న గడ్డి వరకల్ని చూస్తూ 'అమ్మా! ఎన్ని లోలక్కులో, పెట్టుకో, బాగున్నాయ్యి" అన్నాడు. ఆ పిల్లకు లోలక్కులంటే చాలా ఇష్టం అని తాతయ్యకు తెలును. అయినా అవి గడ్డివరకలు కదా! ఆ పిల్ల చాలా నవ్వింది. కానీ తాతయ్య నవ్వలేదు. తరువాత చచ్చిపోయాడు.

"మీ తాతయ్యకు నీ వంటే ప్రేమ" అన్నారు. కానీ ఆ విషయం గురించి ఆ పిల్ల ఆలోచించలేదు. అవసరం కలుగలేదు. ఆ చిట్టి చేతులు ఆ ఎత్తు గోడ పైకి పాకాలని గుడ్డి ప్రయత్నం చేశాయి వ్యర్థంగా. తనను ఆ చోటికి - తాతయ్య దగ్గరకు వెళ్లనివ్వలేదు వాళ్లు... తరువాత ఒంటరిగా కూర్చున్నప్పుడు 'తాతయ్యా నువ్వు ఎక్కడున్నావు? ఎందుకెళ్లిపోయావు?' అనుకుంది దిగులుగా చాలాసార్లు.

★ ★ ★ ★

నలభై ఏళ్ల తరువాత అప్పటి అనుభవంలోని గాఢతా, బరువూ తొలగిపోయినై. ఇప్పుడు సుమిత్రకు అది ఒక తియ్యని జ్ఞాపకం మాత్రమే! లోక రీతిన ఇది ఒక అతి సామాన్యమైన విషయం. ఇందులో మరొకరితో చెప్పుకోవలసిన గొప్పతనం ఏమీ లేదు.

"పిల్లలు తమ కెదురయ్యే అనుభవాల్ని గ్రహించే పద్ధతి వేరు. వాటిని వ్యక్తీకరించగల భాష లేదు. పెద్దల తీరు వేరు. భాష ఆధారంగా అనుభూతుల్ని సృష్టించుకుంటూ స్పందిస్తారు. ఈ పెద్దలు పసితనాన్ని అర్థం చేసుకునే మార్గమేదీ? అనుకుని నిట్టూర్చింది సుమిత్ర.

"అమ్మమ్మా!"

"అమ్మమ్మా!"

తానేదో ప్రముఖ వ్యక్తి అయినట్లు గొప్పదనం ఒలకబోసుకుంటూ దర్జాగా అడుగులేస్తూ వస్తున్నాడు మనుమడు. ఆ పిలుపులో ధిక్కారం లేని అధికారం నిండి ఉంది. చిన్న బుడుతకు ఎంత ధీమా! ఆవిడేదో తన ప్రత్యేక అంగరక్షకురాలైనట్లు!

"అమ్మమ్మా!" గట్టి కేక.

ఒక్క క్షణం ఆలస్యంగాని, నిర్లక్ష్యంగాని సహించలేడు! వాడి సొంత అమ్మమ్మ వాడి మాట లక్ష్య పెట్టకపోవడమా? నవ్వుకుంటూ 'చిట్టి రాజు' అనుకుంది. ఆవిడ జీవితంలో మూడేళ్లపాటు ప్రతి నిముషమూ తనదిగా చేసుకున్న మహారాజు!

"భోజనానికి టైమైంది. రా!" అంటూ వాళ్లమ్మ వచ్చి వాడి నెత్తుకెళ్లింది. అక్కణ్ణించీ సుమిత్ర ఉన్న గదిలోకి అన్నీ వినిపిస్తున్నవి.

"అమ్మమ్మ కావాలి."

"ఎందుకూ? బయట తిరుగుతూ అన్నం తినకూడదు. టేబుల్ దగ్గరే తినాలి! తిను!"

"అమ్మమ్మ వస్తే తింటా!"

వాళ్ల నాన్న "నోర్ముయ్" అనడమూ, ఫట్‌మన్న శబ్దమూ, వాడు "అమ్మమ్మా" అంటూ ఏడవడమూ వినిపించాయి.

ఆ దెబ్బ తనకే తగిలినట్లు విలవిల్లాడింది సుమిత్ర. "వాళ్ల నాన్న వాడికి అన్నం తినడం నేర్పిస్తున్నాడు" అనుకుంది తన మనసును అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ.

వాడి ఎక్కిళ్లు క్రమంగా తగ్గిపోయినై. వాళ్లమ్మ ఎత్తుకుని ఓదారుస్తూన్నట్లుంది. మనసును కుదుటపరచుకునే ప్రయత్నంగా సుమిత్ర ఆలోచనలు వేదాంతపు దారి పట్టినై... మనిషంటే ఏమిటి? ఒక పరిధి లోపల ఉన్న ఒక రూపం. ఆకాశమంతా నిండి ఉన్న అతని అంతస్సత్వం కాదు.


ఆరోగ్య ప్రదమైన, పరిశుద్ధము, సురక్షితమైన మంచినీటికి తులసీ వాటర్ ఫిల్టర్.




మీ యింట్లో తులసి వుండేట్టుగా చూసుకోండి.

తులసి వట్టి వాటర్ ఫిల్టర్ మాత్రమే కాదు. అది పరిశుద్ధతకు ప్రతిరూపం. తులసి నుండి వచ్చే ప్రతి నీటి చుక్క, ప్రత్యేకంగా తయారుచేయబడ్డ, అత్యాధునిక కంప్యూటరైజ్డ్ కాండిల్స్ ద్వారా వడకట్టబడి ప్రకృతి సిద్ధమైన నీటిలా పరిశుద్ధమైనది.

పేలమ్ స్టెయిన్ లెస్ స్టీలుతో తయారుచేయబడిన తులసీ వాటర్ ఫిల్టర్ త్రుప్పును దరిచేరనివ్వదు. అత్యాధునికమైన వెల్డింగ్ ప్రక్రియ ద్వారా వెల్డింగ్ చేయబడిన తులసి వాటర్ ఫిల్టర్‌లో నీరు కొంచెం కూడా కారదు.

వీటన్నిటినీ మించి, తులసి వాటర్ ఫిల్టర్ విరగనటువంటి ఏ.బి.యస్ ప్లాస్టిక్‌తో ప్రత్యేకంగా తయారు చేయబడిన పంపు కలిగి వుంది. ఈ పంపు యొక్క ప్రత్యేకత – సునిశితమైన స్పర్శకల మీట, ఆగకుండా ధారగా నీరు ప్రవహించేందుకు వీలుగా ప్రత్యేకమైన 'లాక్–అప్' వ్యవస్థ.



తులసి వాటర్ ఫిల్టర్ ఎంత నాణ్యత గలది అనేందుకు నిదర్శనం – ప్రతి ఫిల్టర్‌కు అందించబడే పది ఏళ్ళ గ్యారంటీ.

అన్ని పేరుపొందిన దుకాణాలలో 16, 24, 34 లీటర్ల సైజులలో లభిస్తాయి.

Reachout/VA/172/92

ఆంధ్రప్రదేశ్‌కు పంపిణీదారులు:

వెంకటేశ్వర ఏజన్సీస్

రెండవ అంతస్తు, అమిదియాల బిల్డింగ్, ఫెర్నాండెజ్ నర్సింగ్ హోమ్ వద్ద, బొగ్గులకుంట, హైదరాబాదు – 500 001.

Ph. 242578

తులసి

వాటర్ ఫిల్టర్.


పరిశుద్ధమైన, ఆరోగ్యప్రదమైన జీవనానికి ప్రతిరూపం.

కొన్ని దేశాల
రాజ్యాంగాల కన్నా
వీధి గోడ క్కొట్టిన
పిడక లేం తీసిపోవు!

పిడకలు-
పొయ్యిలోకైనా పనికొస్తాయ్
రాజ్యాంగ ప్రతులైతే-
పొయ్యిలోనూ 'పొగే' పెడతాయ్!

## రాజ్యాంగంలో పిడకల వేట

'లకుమ'



అతని కోరికలూ, ఆశలూ, అనుబంధాలూ అసలే కాదు. లోకంలో అతను చెయ్యవలసిన పనులే అతని పరిధి లోకం దృష్టిలో మనిషంటే అంత మాత్రమే. ఎంత విచిత్రం!

భోజనాల గదిలో నుంచీ అన్నం పళ్లెం ఛల్రుమని నెట్టిన శబ్దం. అది టేబుల్ పై నుంచీ క్రిందపడ్డ చప్పుడు. ఆ పళ్లెమేదో తన గుండెల మీద పచ్చిపడ్డట్లు ఎగిరిపడింది ఆమె. ప్రయత్నం మీద స్థిమితపడ్డా గుండె వేగం తగ్గలేదు. ఆలోచనలు అర్థం కాని ఆదుర్దాతో వేగం పుంజుకుని ఏటో పరుగెత్తుతున్నవి... వాడిని అన్నం తినమంటే అమ్మమ్మ కావాలంటాడు. నిద్రపోదామంటే అమ్మమ్మ దగ్గరికి పోతానంటాడు. వాడిని మంచి చేసుకునే ప్రయత్నంగా బజారుకు తీసుకెళ్లి, వాడు కోరిన బొమ్మలు కొని తెస్తే ఇంట్లో కాలు పెట్టగానే ఆ బొమ్మలన్నింటినే పట్టుకుని "అమ్మమ్మా! ఎన్ని బొమ్మలో చూడు" అంటూ నేరుగా ఆమె దగ్గరికి వచ్చేస్తాడు. కొడుకుని సొంతం చేసుకోవాలని ఆరాటపడుతున్న తండ్రికి కోపం రాదా? అన్నం పళ్లెం తోసెయ్యడా మరి? అతన్ననుకోవలసిన పని లేదు! అంతే కాకుండా లోక రీతిన తనకు వాడి బాధ్యత లేదు.

ఊరికే పెంచిన మమకారాన ఇట్లా బాధపడుతున్నది.

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే!
సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చలతత్వే జీవన్ముక్తః ॥భజ॥

కర్తవ్యం తెలిసిపోయింది. కనుక ఇహ తను సాధించాల్సింది సత్సంగత్వం, నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం - అంతే! తరువాత అసలు బాధ అనేదే ఉండదు.

"మీ అమ్మ వీడిని గారాబం చేసి పాడు చేసింది. డిసిప్లిన్ లేదు, పాడు లేదు. పెద్దయినాక బాధ్యతలు ఎట్లా తెలుస్తవి? వీడు ఏమైపోతాడో ఏమో!" పెద్దగా అరుస్తున్నాడు శోభన్.

ఆవిడ వేదాంతం పారిపోయింది. ఎందరో అల్లుళ్లు ఎంతరో అత్తల్ని అన్న మాటలే అని తెలిసినా, విన్నప్పుడు ఒంటికి కారం రాచుకున్నట్లే అయ్యింది. డిసిప్లిన్, బాధ్యత అన్న పదాలు వింటే ఆమెకి కంపరం. తానేమీ పొరపాటు చెయ్యలేదని ఆమె నమ్మకం! కోపంగా పిల్లల పెంపకాన్ని గురించిన శాస్త్రీయమైన విషయాలు మరోసారి మననం చేసుకుంది...

సవ్యంగా నడుస్తున్న సాంఘిక వ్యవస్థలో పిల్లల పెంపకానికీ, వాళ్లు పెద్దయ్యాక ఏర్పడే వ్యక్తిత్వానికీ మధ్యన ఉండే సంబంధం ఇంకా పూర్తిగా, కచ్చితంగా నిర్ధారణ కాలేదు. కానీ కొన్ని విషయాలు స్థూలంగా గుర్తించబడినవి.

బాల్యంలో అతి నిర్లక్ష్యానికి గురైన పిల్లలు పెద్దయ్యాక మానసిక వ్యాధులకు లోనవుతారు. గారాబం చెయ్యబడిన పిల్లలు అలా కాదు, పైగా మానసికంగా స్థైర్యం చేయగలిగిన శక్తిమంతులవుతారు.

తల్లి ఒక్కదాని దగ్గరే కాక నలుగురి ఆదరణలో పెరగడం పిల్లలకు మంచిచేసే అవకాశం ఉంది.

ప్రేమ, ద్వేషాలూ ఇతరులపై ఆధారపడడం, పడకపోవడం అన్నవి వ్యక్తిత్వ వికాసంలో మిగతా అన్ని విషయాల కంటే ముఖ్య పాత్ర వహిస్తాయి.

...ఇవన్నీ ఆంత్రోపాలజీ పుస్తకంలో చదివానని అతనికి చెపితే ప్రయోజనం ఏమన్నా ఉంటుందా?

అసలు తన కెందుకింత బాధ? బిడ్డ బాధ్యత తల్లిదండ్రులదే కాని తనది కాదు. తన ఆలోచనలే సవ్యంగా లేవు. ప్రతి మనిషికీ లోక రీతిలో ఒక పాత్ర కేటాయింపబడి ఉంది. ఆ పాత్ర పరిధిలో సంచరించి తప్పుకోవాలి...

కాని మనిషి అంతరంగంలో ఒక భాగానికి, ఆలోచనకు అందకుండా ఏ సూత్రానికీ, కట్టుబడకుండా ప్రవహించే గుణం ఉన్నట్లుంది. మనిషి మొత్తాన్ని తనలోకి లాగేసుకోగలదు అది. పంచేంద్రియాలనీ, మనసునీ, చిత్తాన్నీ - ఆత్మనీ కూడానేమో!

ఆమెకు సరిగ్గా అదే జరిగి ఉంటుంది ఆమె చేతులు ఏడుస్తున్న చిట్టి రాజును ఎత్తుకుని గట్టిగా కావలించుకోవాలని ఆరాటపడుతున్నది. ఆమె చూపు పేదదై ప్రపంచం కళా విహీనంగా కనిపిస్తున్నది. ఆమెకు వినిపించే ఏ శబ్దంలోనూ తియ్యదనం లేదు. తియ్యదనమంతా 'అమ్మమ్మా' అన్న మనవడి పిలుపులోకి ఇమిడి పోయినట్లుంది. ఆమె మనసులో సంతోషమూ, ఆనందమూ లేవు. ఆమె తన పరిధిలో ఉండకుండాచిట్టిరాజులోనికి ఎందుకు ప్రవహించి పోయింది!

ఇంత వరకూ బిగపట్టుకున్న కన్నీళ్లు ఇప్పుడు కురవడం మొదలెట్టాయి... ఆ కన్నీళ్లలో కోపం అంతా కడుక్కుపోయింది. 'ప్రపంచంలో ఎన్నో విషయాలు జరుగుతూ ఉంటవి. అవి తనలోని నిజాన్ని తెలుసుకోవడానికి సాధనాలు మాత్రమే కావాలి!' అనుకుంది కళ్లు తుడుచుకుంటూ.

బహుశా వాడికి తన అవసరమెంతో అంతకంటే ఎక్కువగా మమకారాన్ని పెంచుతూ ఎక్కువగా ఆధారపడే మానసిక స్థితికి చేరుకున్నట్లుంది. అన్న విషయం తొలిసారిగా గ్రహింపుకు వచ్చింది.

"అమ్మమ్మా!" అంటూ వచ్చాడు చిట్టి రాజు.

"నేను ఎప్పుడూ అమ్మమ్మ దగ్గరే నిద్రపోతా!' ఈ ఊరు వచ్చిన తొలి రోజుల్లోనే స్పష్టం చేశాడు తన అభిప్రాయం. రోజూ వీడితో గొడవ పెట్టుకుని సమయం వ్యర్థం చేసుకోవడం ఇష్టంలేక విశ్రాంతిగా టీ. వీ. చూసుకునే అలవాటు మానుకోలేక 'సరే' నని ఒప్పుకున్నారు అమ్మా నాన్నా. తన బుల్లి బుల్లి ప్రయత్నాలతో ఏదో సాధించాలనుకున్న చిట్టిరాజు రాత్రి నిద్రలోకి జారిపోవడానికి అమ్మమ్మ దగ్గరకే వస్తున్నాడు ఇప్పటి వరకూ.

మనవణ్ణి ముద్దు పెట్టుకుని ప్రక్కన పడుకోబెట్టుకుంది సుమిత్ర. ఇంత వరకూ ఆమె మనసు నిండా ముసురుకున్న ఆలోచనలన్నీ మటుమాయమైపోయినై. మనవణ్ణి చూడగానే నీరసపు వేదాంతం పోయి ఒక్కసారిగా సంతోషం ముంచుకొచ్చింది. దానితోపాటు సర్వజనావళి పట్ల గొప్ప ఔదార్యమూ వచ్చేసింది. పుర్రెకో బుద్ధి అన్న మాట ఉండనే ఉంది. నలుగురు మనుషులున్న చోట నాలుగు రకాల ఆలోచనలూ, నాలుగు విధాల వాగుడూ వుండడం సహజమే కదా అనుకుంది ఉదారంగా.

మనవడి తల నిమురుతూ "నాయనా, నీవు చాలా పెద్ద వాడివి అవుతావు. మంచివాడివి అవుతావు. అప్పుడు నేను దూరంగా మనూళ్లో ఎక్కడో ఉంటాను. నీవు పెద్దయిపోతావుగా. అందుకని మా బాబు ఎంత పెద్దయ్యాడో అని బలే సంతోషిస్తాను..."

ఆవిడ చెపుతుండగానే "ఊఁ సరే, అవుతాలే" వరమిస్తున్న దేవుడిలాగా సెలవిచ్చి అమ్మమ్మ మీద చెయ్యేసి నిద్రలోకి జారిపోయాడు ఉదయభానుడు.

"జీవితం చాలా విచిత్రమైనది" అనుకుంది సుమిత్ర అలసటగా.

ఈ నిరంతర చలనంలో నిజం ఎక్కడుందో ఆనవాలు చిక్కలేదామెకు.